క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెస్సీ మ్యాథమెటిక్‌లో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం స్లేట్ నెట్ పీహెచ్‌డీ, బోధన అనుభవం ఉండాలన్నారు. ఈనెల 21 లోపు ఇచ్చోడ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గంగనీళ్ల సేకరణ



గంగనీళ్లను తీసుకువస్తున్న సభ్యులు

ఇచ్చోడ: ఈనెల 20 నుంచి మండల కేంద్రంలో నిర్వహించే సంతోషిమాత ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఆలయ కమిటీ సభ్యులు నిర్మల్ జిల్లా సోన్ వద్ద గంగనీళ్లు సేకరించి ఇచ్చోడ ఆలయానికి తరలించారు. శుక్రవారం బ్రహోత్సవాల ప్రారంభం సందర్భంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి బ్రహ్మోత్సవాలు ప్రారంభిచనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అనురాజ్ రెడ్డి, నిమ్మల గోవర్ధన్‌రెడ్డి, రాజ్ కిరణ్‌రెడ్డి, నిమ్మల వంశీరెడ్డి పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగించండి

నేరడిగొండ: మండలంలోని బోథ్ ఎక్స్‌రోడ్ నుంచి బోథ్ వైపు వెళ్లే రహదారి ఇరువైపులా ముళ్ల పొదలు దర్శనమిస్తున్నాయి. ఈ దారిగుండా ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ముళ్లపొదలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తాం

బోథ్: బోథ్ బస్టాండ్ స్థలం అన్యాక్రాంతం కాకుండా బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. గురువారం బస్టాండ్ స్థలాన్ని పరిశీలించారు,. డిజిటల్ మ్యాప్ ఆధారంగా కొలతలను పరిశీలించారు. ఆయన వెంట నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

సీఐకి సన్మానం

బోథ్: బోథ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర రావును బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు గురువారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల విషయంలో సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ద్యాగాల నారాయణ, రుక్మణ్ సింగ్, మల్లెపూల సుభాష్, భీమ బుచ్చన్న, రాయల్, వెంకటరమణ, బూర్గుల మల్లేష్, మల్లెపూల సత్యనారాయణ, సల్ల రవి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



తనిఖీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్: నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఉన్న బస్తీ దవాఖానను వైస్‌చైర్మన్ కావలి సంతోష్, కమిషనర్ మనోహర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో మందుల నిల్వలు, వాటి గడువు వివరాలను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంగన్వాడీ సిబ్బంది కోసం మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, సీడీపీవో సరిత, నాయకులు షౌకత్‌పాషా, తదితరులు ఉన్నారు.

ఆరోగ్యకర పోటీతత్వం పెంచుకోవాలి

ఖానాపూర్: విద్యార్థులు ఆరోగ్యకర పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని సత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యులు సత్తయ్య అన్నారు. మండలంలోని సత్తనపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు స్పందన, వర్షగౌడ్, అనితకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. మండలంలోని పాతఎల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఇన్‌చార్జి హెచ్ఎం సుదర్శన్ ఆధ్వర్యంలో పోటీల్లో రాణించిన విద్యార్థులు లావణ్య, శ్రీనిత్య, శ్రావణిలకు బహుమతులు అందజేశారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో ప్రేమ్‌సాగర్, ఉపాధ్యాయులు వాల్గొట్ శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

రేషన్‌కార్డులపై ఆశలు..



ఈయన పేరు మల్లెపూల విజయ్ కుమార్ బోథ్ వాసి. విజయ్ దంపతులకు ఐదేళ్ల క్రితం కుమారుడు జన్మించాడు. తన కుమారుడు పేరును రేషన్ కార్డులో చేర్పించేందుకు మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నాడు. అయినా ప్రభుత్వం రేషన్‌కార్డులో తన కుమారుడి పేరు చేర్చలేదు. దీంతో పిల్లలకు సంబంధించి రేషన్ బియ్యాన్ని పొందలేకపోతున్నాడు.



ఈయన పేరు లడేవార్ సంజీవ్ బోథ్ మండలంలోని మర్లపెల్లి గ్రామం. ఐదేళ్ల క్రితం రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇప్పటి వరకు రేషన్ కార్డు అందలేదు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రేషన్ కార్డు లేకపోవడంతో రేషన్ బియ్యాన్ని అందుకో లేకపోతున్నాడు. పలు సంక్షేమ పథకాలకు సైతం దూరమవుతున్నాడు.



- త్వరలోనే ఇస్తామన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రేషన్ కార్డులు లేక ఇబ్బందులు
- సంక్షేమ పథకాలకు దూరం

బోథ్: ప్రభుత్వ అందించే ప్రభుత్వ పథకాలకు తహసీల్దార్ కార్యాలయాల్లో ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు రేషన్ కార్డులు తప్పనిసరి. ఏడేళ్లుగా కొత్త రేషన్ కార్డులతో పాటు కార్డుల్లో పేరు చేర్చే ప్రక్రియ చేపట్టకపోవడంతో అనేక మంది పేద ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. మరోవైపు ఐదారేళ్ల క్రితం పుట్టిన పిల్లలతో పాటు అకారణంగా తొలగిస్తూ వస్తున్న అనేక మంది పేదల పేర్లు కార్డుల్లో చేర్చకపోవడంతో వారికి ప్రభుత్వాలు అందించే రాయితీ బియ్యం అందడం లేదు. కొత్త రేషన్ కార్డులతో పాటు జిల్లాలో ఇప్పటికి దరఖాస్తు చేసుకున్న వేల మందికి రేషన్ కార్డులు మంజూరు కాలేదు.

తొలగింపులు చేసి.. చేర్పులు చేయలేదు..

రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించే ప్రక్రియ వెంటనే జరుగుతుండగా.. పేరు చేర్చే ప్రక్రియ మాత్రం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో అనేకమంది పేర్లు తొలగించుకునేందుకు ముందుకు రావడం లేదు. మరోవైపు ఇటీవల కాలంలో కొన్ని కొత్త కార్డులు మంజూరు చేసిన సమయంలో అకారణంగా పలువురి పేర్లను కార్డుల్లో నుంచి తొలగించారు. దీంతో వారు ఆరోగ్యశ్రీ వంటి పథకానికి అర్హులు కావడం లేదు. ఆరోగ్యశ్రీకి అర్హత ఉండాలంటే కచ్చితంగా తెల్లరేషన్ కార్డులు ఉండాలి. దీంతో చాలా మంది తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు గాస్తున్నారు. 2016 నుంచి ఆదిలాబాద్ జిల్లాలో 19,811 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా చేపడుతున్న ఈ కేవైసీలు రేషన్‌కార్డుదారులకు మాత్రమే అవకాశం ఉంది. దీంతో రేషన్ కార్డుల్లో లేని వారు ఆయుష్మాన్ భారత్‌కు దూరమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులకు అందించాలి



నాకు వివాహమై ఐదేళ్ల గడిచింది. ఇప్పటికీ రేషన్ కార్డు రాలేదు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందించాలి. ఎంతో మందిని రేషన్ కార్డుల నుంచి తొలగించారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. పుట్టిన పిల్లలను రేషన్ కార్డుల్లో చేర్చడం లేదు. తొలగించిన కార్డుదారులను కొత్త కార్డులు మంజూరు చేయడం లేదు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీ బియ్యాన్ని అందుకోలేకపోతున్నారు.

– కుమ్మరి రాజు, బోథ్

నేటి నుంచి సోయా కొనుగోళ్ల నిలిపివేత

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం నుంచి సోయా కొనుగోళ్ల నిలిపివేయనున్నట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాయంత్రం 5 గంటలలోపు మార్కెట్ యార్డు లోపలికి వచ్చిన రైతుల సోయా కొనుగోళ్ల చేస్తామన్నారు.

పత్తి కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని స్వప్న, రాఘవేంద్ర, సాయి దత్త జిన్నింగ్ ఫ్యాక్టరీలోని సీసీఐ కేంద్రాల్లో శుక్రవారం నుంచి 22 తేదీ వరకు తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. పత్తి నిల్వలు అధికంగా ఉండడం వల్ల సీసీఐ అధికారుల సూచన మేరకు కొనుగోళ్లు మూడు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు గమనించాలని కోరారు.

31న పీడీఎస్ బియ్యం వేలం

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 167.7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఈనెల 31న బహిరంగ వేలం వేయనున్నట్లు డీఎస్‌వో వాజీద్ అలీ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల ప్రజలు, లైసెన్స్ కలిగిన వ్యాపారులు రూ.10 వేలతో జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం ఆదిలాబాద్ పేరిట డీడీలు తీసి ఈనెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు కార్యాలయంలో అందజేయాలన్నారు. 31న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో గల ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉదయం 10 గంటలకు జరిగే వేలం పాటకు హాజరుకావాలన్నారు.

‘అమిత్‌షా క్షమాపణ చెప్పాలి’



ఆదిలాబాద్‌రూరల్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహరాజ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ పేరు కంటే దేవుడి పేరును జపిస్తే ఏడు జన్మల స్వర్గం ప్రాప్తిస్తుందంటూ మాట్లాడటం సరికాదన్నారు. క్షమాపణ చెప్పకుంటే ప్రజా సంఘాలు, కుల సంఘాలు, బహుజన పార్టీలను కలుపుకొని ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బడుగు రాజేశ్వర్, తొంటీకూరి సంతోష్, గొంటిముక్కుల ఓమన్న, బడుగు భూమన్న పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం..

షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నాయకులు రత్నజాడే ప్రజ్ఞా కుమార్, కొప్పుల రమేష్, శిక్షక్ కాంతారావు వాగ్మారే, రాజు మస్కే, రత్నజాడే ఉదయ్ కుమార్, పట్టాడే రాజు, ఉజ్వల ధూడే, మేకల మల్లన్న, మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పట్ల అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ అన్నారు. తక్షణమే అమిత్‌షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బోథ్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సంఘం నాయకులు అన్నారు. గురువారం సొనాల గ్రామంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు భగత్ ప్రవీణ్, మాజీ అధ్యక్షులు బత్తుల రమేష్, మద్దెల రమేష్, భీంరావ్ , సొన్న హరీష్, నాయకులు పాల్గొన్నారు.



బోథ్: సొనాల గ్రామంలో..

బజార్‌హత్నూర్: అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెస్రం జంగుబాబు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కానిందే జగదీశ్వర్, రాజు, నాందేవ్, ప్రహ్లాద్, శ్రీనివాస్, అర్జున్, ప్రకాష్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పెటా అధ్యక్షుడిగా కోరెడ్డి పార్థసారథి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా పెటా (పీఈటీ) అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కోరెడ్డి పార్థసారధి, ప్రధాన కార్యదర్శిగా జంజర్ల సాయి కుమార్‌లు గురువారం ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన ఎన్నికల్లో వీరిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పెటా సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల యొక్క క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల అధికారిగా ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు వ్యవహరించారు. కార్యక్రమంలో దయానంద్ రెడ్డి, హరిచరణ్, రాష్ట్రపాల్, మహేశ్, శ్రీనివాస్, వెంకట రమణ, రాము, నాందేవ్, గోపాల్, ఉష్కం రఘుపతి పాల్గొన్నారు.

నేరడిగొండలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

నేరడిగొండ: మండల కేంద్రంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్లు సాయన్న, శ్రీనివాస్ రెడ్డిలు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త గీత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, నేతల తలరాతను మార్చేది ఓటే నని యాపల్‌గూడ జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాములు అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం ద్వారా ఎన్నికల పట్ల అవగాహన కల్పించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఓటర్ల పాత్రను విద్యార్థులు పోషించారు. విద్యార్థులు వరుస క్రమంలో నిలబడి ఓటు వేశారు. పాఠశాల ప్రాంగణం ఎన్నికల వాతావరణం తలపించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.వినోద్ రెడ్డి, ఎన్.వినోద్ కుమార్, కె.వేణు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మామిళ్ల పార్వతి పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేయవద్దు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామ శివారులో ఉన్న రైల్వేగేటు 27ను మూసి వేయవద్దని పొన్నారి గ్రామస్తులు రైల్వే డీఆర్ఎంకు విన్నవించారు. గురువారం నాందేడ్‌లోని రైల్వే కార్యాలయంలో పొన్నారి గ్రామస్తులు డీఆర్ఎంను కలిసి రైల్వే గేటును మూసి వేయకుండా చూడాలని కోరారు. రైతుల పంట చేనులు రైల్వే గేటు ఆవతలి వైపు ఉన్నందున గేటు మూసివేస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. స్పందించిన డీఆర్ఎం ఇప్పట్లో గేటు మూసివేయకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రఘు, మాజీ సర్పంచ్ అశోక్, గ్రామస్తులు రమణ, అరుణ్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



అవగాహన కల్పిస్తున్న యశోద

తలమడుగు: బాలికలు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త యశోద అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు బాలికలను రక్షిద్దాం, చదివిద్దామని కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికల విద్య ప్రాధాన్యత గురించి వివరించారు. విద్యార్థులు ఉన్నత చదువు చదివినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్ఎం చంద్రమ్మ, సిబ్బంది కోటేశ్వర్, నిఖిలేశ్వర్, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో నాయకులు

ఇంద్రవెల్లి: అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో మాల మహానాడు నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని బాబాసాహెబ్ అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగే మాల మహానాడుకు తరలివెళ్లకుండా గురువారం తెల్లవారుజమున నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు భామ్నె శ్రీరాం, మస్కే రాజువర్ధన్, కాంబ్లే సూరజ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపడుతున్నామని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన చేపట్టారు. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఇంటింటికీ వెళ్లి పంచాయతీ సిబ్బంది పరిశీలించడం జరుగుతుందన్నారు. అర్హులైన లబ్దిదారుల జాబితాను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఇళ్ల మంజూరులో అవకతవకలకు తావులేకుండా చూస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సద్దాం, టీఏ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోపాటు చదువులో రాణించాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత క్రీడలతో పాటు చదువులో రాణించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. గురువారం మండలంలోని గౌరపూర్ గ్రామంలో గ్రామ కమిటీ, ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువత సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల్లో, చదువులో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ మసుద్, జితేందర్, మడావి మారుతి, భుమేష్, మడావి సుంగు, సుర్పం మాధవ్‌రావ్, సుర్పం సాయి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మెట్ల పూజ



మెట్లపై పడిని వెలిగిస్తున్న అయ్యప్ప స్వాములు

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామంలో గురువారం అయ్యప్ప స్వామి మెట్ల పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గురుస్వామి సతీష్ మంత్రోచ్ఛరణల నడుమ అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పద్దెనిమిది మెట్లపై పడిని వెలిగించారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాస్, పోచ్చారెడ్డి, రాజన్న, సంతోశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ సురుకుంటి మంజుల, శ్రీధర్ రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ వసతిగృహ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ సంఘ భవనంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా నర్సింహులు, కార్యదర్శిగా శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా పర్వేజ్, ఉపాధ్యక్షులుగా రవీందర్, గంగాదేవి, రాధ, సంయుక్త కార్యదర్శులుగా దేవన్న, రోహిత్, సంధ్య, కోశాధికారిగా చిన్నయ్య, కార్యనిర్వహణ కార్యదర్శిగా శ్యామ్‌సుందర్, ప్రచార కార్యదర్శిగా రాథోడ్ అనిల్, కార్యవర్గ సభ్యులుగా రవీందర్, నాగేశ్, శ్రీవాణి ఎన్ని కయ్యారు. వీరికి నియామక పత్రాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. టీఎన్జీవో కార్యదర్శి నవీన్‌కుమార్, ఓంప్రసాద్, శివకుమార్, సుజాత, దత్తు పాల్గొన్నారు.